## జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె





# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

సోమవారం | 23 జూన్, 2025 | పేజీలు : 06


# అల్లాదుర్గంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

### దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలి
### సకల సౌకర్యాలతో కస్తూరిబా గాంధీ విద్యాలయాలు
### హాస్టల్లో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ
### కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** అల్లాదుర్గం మండలంలో ఆదివారం విస్తృతంగా పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎస్సీ హాస్టల్, కేజీబీవీలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతిగృహం , కేజీబీవీ పాఠశాల మరమ్మతు పనులను ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజరు పట్టికలు, ఓపి రిజిస్టర్లను పరిశీలించారు. ఆకస్మిక పర్యటనతో వైద్య సేవలో సమూల మార్పులు సంతరించుకున్నాయని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. సమయపాలన పాటించి నాణ్యమైన వైద్యం అందిస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. అనంతరం కస్తూర్బా గాంధీ విద్యాలయం పరిశీలించారు. మరమ్మత్తులకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన సౌకర్యాలు సదుపాయాలతో ప్రభుత్వం కస్తూర్బా గాంధీ విద్యాలయాలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఎస్సీ హాస్టల్ ను పరిశీలించి హాస్టల్ లోని నిత్యావసర సరుకులను, స్టోర్ రూంను ఆహార పదార్థాలు,వంట గదులు, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. అన్ని సంక్షేమ హాస్టల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఎస్సీ హాస్టల్లో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంధ్య వైద్య సిబ్బంది సుదర్శన్ హాసీనా,హాస్టల్ వార్డెన్ కిషోర్ జోషి, కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పచ్చదనానికి ప్రారంభమైన వేదిక



### జిల్లా సంక్షేమ అధికారి జయంతి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు, హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, టీజీ ఎన్‌బీ శాఖ, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి ,,జయంతి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ – పచ్చని ప్రకృతిని కాపాడటం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి. అలాగే యువత చెడు వ్యసనాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి అని పేర్కొన్నారు.టీజీ ఎన్‌బీ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, “డ్రగ్స్ పట్ల యువతలో సరైన అవగాహన పెరగాలి. డ్రగ్స్ అనే మహమ్మారిని అంతమొందించేందుకు యువత ముందుండాలి” అని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్ మాట్లాడుతూ, డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేస్తాయి. విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని నిష్టతో ముందుకు సాగాలి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీజీ ఎన్‌బీ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, సిబ్బంది, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ తిరుపతి, ఎన్సీసీ లెఫ్టినెంట్ స్వామి గారు మరియు సిబ్బంది , కళాశాల లెక్చరర్ నహేద గారు, నర్సింగ్ ఆఫీసర్ అరుణ కుమారి గారు, డీసీపీఓ ఇంచార్జ్ ప్రవీణ్ గారు, ఎఫ్ఆర్ఓ రవి కృష్ణ గారు, విమెన్ హబ్ కోఆర్డినేటర్ కల్యాణి, సఖి అడ్మిన్ హైమవతి, నషా ముఖ్త్ భారత్ అభియాన్ కోఆర్డినేటర్ తేజస్విని, జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది రాజేష్ , రజిత , మానస స్వర్ణలత, కళాశాల ఎన్సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు డ్రగ్స్ వ్యతిరేకంగా యువతలో చైతన్యం పెంచే ప్రయత్నం జరిగింది.

## చర్చనీయాంశంగా మారిన
# ‘ప్రజాపక్షం’ కథనం..!

### అక్రమ రిజిస్ట్రేషన్ల కథనంపై చర్చ..

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/రామాయంపేట:** ప్రజాపక్షం పత్రికలో ప్రచురితమైన కథనం రామాయంపేట మండలంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలకు ప్రైవేటు రిజిస్ట్రేషన్లు అనే కథనం అక్రమార్కుల గుండెల్లో దడపుట్టించిందని చెప్పవచ్చు. పట్టణంలో ఎక్కడ చూసిన ప్రజాపక్షం పత్రికలో వచ్చిన వార్తపైనే ప్రతి ఒక్కరు చర్చించుకుంటున్నారు. బీడి కార్మికుల ప్లాట్లపై అక్రమ రిజిస్ట్రేషన్లు చేయడం ఏమిటని ఇదే విషయం ప్రజలను, ప్రజాసంఘాలను ఈ కథనం కదిలించింది. ప్రభుత్వ అధికారులు సక్రమంగా విదులు చేపడితే ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవని, అక్రమార్కులకు అవకాశం ఇవ్వకుండా న్యాయం పక్షాన అధికార యంత్రాంగం ఉండాల్సిన అవసరం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇట్టి అక్రమాలపై జిల్లా కలెక్టర్‌తో పాటు అధికార యంత్రాంగాన్ని కలిసి పిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. ఆదివారం పెద్దమ్మ దేవాలయం వద్ద ముదిరాజ్ సంఘం సభ్యులు సమావేశమై అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ మోసాలకు పాల్పడుతున్న శీలం సుభాష్‌రెడ్డిపై ప్రభుత్వ చర్యల కోసం ఎక్కడి వరకైనా వెళ్లుటకు సిద్ధంగా ఉండాలని ఆసంఘం కమిటి తీర్మానించినట్లు తెలిసింది. ప్రజాపక్షం పత్రికలో వచ్చిన వార్త పేపర్ కథనాన్ని స్థానికులు జిరాక్స్‌లు తీసి ప్రజలకు పంచడం విశేషం.

# దళితులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి



# భద్రకాళీ అమ్మవారికి రూ. కోటి రథం

ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : వరంగల్ నగరంలోని ప్రసిద్ధి గాంచిన భద్రకాళి దేవస్థానం నందు గురువారం 26062025 నుండి 15 రోజుల పాటు జరుపబడే శాకంభరీ నవరాత్ర మహోత్సవముల ఏర్పాట్ల గురించి చర్చించడానికి సమావేశమైన ఆలయ పాలక మండలి (ధర్మకర్తల మండలి) కంచి కామాక్షి, అమ్మవారి రథాన్ని పోలిన రథాన్ని భద్రకాళీ అమ్మవారికి ఒక కోటి రూపాయలతో తయారుచేయించడానికి తీర్మానించింది. అమ్మవారి గుడి చుట్టూ మాడవీధులు నిర్మాణం పూర్తవుతున్నందున ఇకపై అమ్మవారికి జరిపే వాహన సేవలు, రథ సేవ ఇత్యాదులు మాడవీధుల గుండానే జరుపుతారు. ఇప్పటి వరకు ఆలయానికి మాడవీధులు లేనందున ప్రదక్షిణ ప్రాకారంలోనే ఈ సేవలు నిర్వహించబడుతున్నాయి. ఇకపై అన్ని సేవలు మాడవీధుల గుండానే జరుపబడతాయి. ఈ దిశలో భాగంగా వాహన సేవలు జరుపడానికి రథోత్సవం జరుపడానికి పెద్ద రథం కంచికామాక్షమ్మ రథాన్ని పోలిన రథం జగము శాస్త్రం ప్రకారం రథం చేయడానికి చర్చించగా దాదాపు కోటి రూపాయలు ఈ రథానికి ఖర్చవుతుందని శ్రీవర్ధితాదారుమయమైన (టేకు చెక్కతో) రథం తయారు చేయించడానికి ధర్మకర్తల మండలి సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ నిర్మాణానికి కావలసిన ప్రభుత్వ అనుమతులు ఆలయ కార్యనిర్వాహక వర్గానికి జారీ చేయించడానికి తెలంగాణా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ గారిని, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డిని ధర్మకర్తల మండలి కోరింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డా॥ బి.శివసుబ్రహ్మణ్యం (చైర్మన్) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోతుకూరి మయూరిరామేశ్వర్రావు,ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు మరియు ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయకుమార్ , కూచన హరినాథ్ ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అమరజీవుల త్యాగాలు ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి



ప్రజాపక్షం/నర్సంపేట: అమర జీవుల త్యాగాలు ఎంతో స్ఫూర్తిదాయకమని సమసమాజ స్థాపనకే అమరవీరులకు ఇచ్చే ఘనమైన నివాళి అని ఎంసిపిఐ(యు) పొలిట్ బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఎంసిపిఐ(యు) డివిజన్ కమిటీ సభ్యుడు కుక్కల యాకయ్య సంతాప సభ డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుక్కల యాకయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వల్లెపు ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ పుట్టటం చనిపోవడం సహజమైనప్పటికీ కష్టజీవుల కోసం ప్రజా సమస్యల పరిష్కారానికి నీతిగా నిజాయితీగా ఎర్ర జెండా పట్టుకుని కృషి చేసి కడవరకు జీవించిన అమరవీరులకు చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. బూర్జువా భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గాల అనుకూల పాలకులు ప్రజల శ్రమను దోచుకోవడమే ఏకైక లక్ష్యంగా అందరికీ చెందాల్సిన సంపదను కొద్ది మందికి కట్టబెడుతూ ప్రజలపై భారాలు వేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని, ఈ క్రమంలో శ్రమజీవులు ఎంత కష్టపడినా కనీస అవసరాలు తీర్చుకోలేని స్థితిలో ఉన్నారని, వారికి అండగా కమ్యూనిస్టు కార్యకర్తలు పోరాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, నాగెల్లి కొమురయ్య, కుటుంబ బాబురావు, వంగల రాగసుధ, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జిల్లా, డివిజన్ కమిటీ సభ్యులు దామ సాంబయ్య, మోటం సురేష్, బండారి మల్లేష్, మార్త నాగరాజు, ఏఐసిటియు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ మసూద్, డాక్టర్ కోటేశ్వర్, స్థానిక నాయకులు గద్దం స్వరూప, పుట్టపాక సునీత, యాదగిరి, స్వామి, కసుబాల సతీష్, అచల, నీల, చంద్రకళ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సమగ్ర కుటుంబ సర్వే పూర్తి కావాలి




ప్రజాపక్షం/నెక్కొండ: ప్రజాసేవతో పాటు అన్ని రంగాలలో ముందున్న ఆర్యవైశ్యులందరూ సంఘటితం కావాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి వంగేటి అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నర్సంపేట పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, అధ్యక్షతన జరిగిన ద్వితీయ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అశోక్ కుమార్ మాట్లాడుతూ, కలిసి ఉంటే కలదు సుఖమని పెద్దల మాటను ఏకీభవిస్తూ ప్రతి ఆర్యవైశ్య బిడ్డ స్నేహపూర్వక వాతావరణం ఏకం కావాలని ఆయన కోరారు. సేవాగుణం ధర్మగుణం కలిగి ఉన్నది ఆర్యవైశ్యులకే అని సమాజం గుర్తించిందని ఆయన గుర్తు చేశారు. పేద ఆర్యవైశ్యులకు అండగా సమాజంలో గుర్తింపు తెచ్చుకున్న ఆర్యవైశ్యులు చేయూతను అందించాలని ఆయన కోరారు. రాబోయే రోజుల్లో అన్ని రంగాలతో పాటు రాజకీయాల్లో సైతం రాణించి ఆర్యవైశ్యులు అంటే అన్నింటా ముందుండే వారని సమాజం చెప్పుకునేలా ముందుకు సాగాలని ఆయన కోరారు. అనంతరం ఆయనకు ఆర్యవైశ్య మహాసభ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లోపు అన్ని మండలాల్లో ఆర్యవైశ్యుల సమగ్ర సర్వే పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యదర్శి గార్లపాటి నాగేంద్రబాబు, కోశాధికారి గందె శ్రీనివాస్ గుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు గోరంటల వెంకటనారాయణ, జిల్లా కార్యదర్శి దేసూ లక్ష్మణ్, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, వాసవి మహిళా విభాగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యజీవితంలో యోగాను ఒక అలవాటుగా మార్చుకోవాలి



ప్రజాపక్షం/ నర్సంపేట : నిత్యజీవితంలో యోగాను ఒక అలవాటుగా మార్చుకోవాలని ఎంఈఓ సారయ్య అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారం పట్టణంలోని విజడమ్ హైస్కూల్లో ఎన్‌సిసి క్లస్టర్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ సారయ్య హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యజీవితంలో యోగాను ఒక అలవాటుగా మార్చుకోవాలని తద్వారా మనిషి శారీరకంగా మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. అనంతరం పాఠశాల చైర్మన్ జహంగీర్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం శారీరక శ్రమ యోగ వంటి ఆసనాలను నిత్యం పాటించాలని తెలియజేశారు. అనంతరం యోగా గురువు ప్రసాద్ యోగ ఆసనాలను, సూర్య నమస్కారాలను విద్యార్థులకు బోధించి వాటి ఉపయోగాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి థర్డ్ ఆఫీసర్లు ప్రశాంత్, రియాజుద్దీన్, కేర్ రాజీవ్, రాజు, అజయ్, వెంకటరత్నం, ఉపేందర్, వీరభద్రయ్య, రియాజ్, రాజేష్ లతో పాటు బాలాజీ టెక్నో స్కూల్, గీతాంజలి డిజి స్కూల్, శివాని పబ్లిక్ స్కూల్, డఫోడిల్స్ హై స్కూల్, ఎంజెపి దంతాలపల్లి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెడెట్ లు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య మిత్రుని కుటుంబానికి చేయూత

ప్రజాపక్షం/ఖిలా వరంగల్: బాల్యంలో తమతో కలిసి చదువుకున్న మిత్రుడు అకాల మరణం చెందితే ఆ కుటుంబానికి అండగా నిలిచారు తన తోటి మిత్రులు, వివరాలలోకెలితే నగరంలోని రంగశాయిపేటలో కత్తెరపల్లి హరీష్ (39) అనే వ్యక్తి అనారోగ్య సమస్యతో ఇటీవల అకాల మరణం చెందాడు. హరీష్ కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనతో 2001 సంవత్సరం వరకు రంగశాయిపేట శారద విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న బాల్య మిత్రులు హరీష్ కుటుంబానికి చేయూతనందించాలనే ఉద్దేశంతో అందరూ కలిసి రూ.33,000 లను హరీష్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ చిన్న వయసులోనే మరణించడం బాధాకరం అని తెలిపారు. అతని కుటుంబానికి భవిష్యత్తులో ఎల్లవేళలా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హరీష్ బాల్యమిత్రులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్ దేశంపై అమెరికా సామ్రాజ్యవాద దాడిని ఖండించాలి

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి: ఇరాన్ దేశంపై అమెరికా సామ్రాజ్యవాద దాడిని తీవ్రంగా ఖండించాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోవర్ధన్అన్నారు. ఇరాన్ దేశంపై అమెరికా జరిపిన క్షిపణి వైమానిక దాడులను నిరసిస్తూ ఆదివారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పోస్టర్లు ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలను తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి అమెరికా చేస్తున్న దుర్మార్గపు దాడులను మా పార్టీ ఖండిస్తున్నదన్నారు . మధ్య పశ్చిమఆసియా ప్రాంతంలో తమ ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి అమెరికా, పశ్చిమ యూరప్ సామ్రాజ్య వాద దేశాలు కలిసి కృత్రిమ ఇజ్రాయిల్ దేశం ఏర్పాటు చేసి ఆ దేశానికి ఆర్థిక సైనిక వైమానిక ఆఖరికి అణు సాంకేతిక పరిజ్ఞానంను సహకారాలను అందిస్తూ దాడులు చేయిస్తున్నాయని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గత వారం రోజులుగా ఇరాన్ తమకు లొంగిపోవాలని లేదంటే దాడులు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, పౌర హక్కుల సంఘం నాయకులు ప్రవీణ్, మానవ హక్కుల వేదిక నాయకులు బండి కోటేశ్వరరావు, పిడిఎం నాయకులు క్రాంతి, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, పివైఎల్ నాయకులు హరిబాబు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడారంలో భక్తుల సందడి

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి: ఆసియా ఖండంలోని అతి పెద్దదైన మేడారం జాతర ఆదివారం సెలవు దినం కావడంతో భక్తుల రద్దీతో సమ్మక్క సారలమ్మను భక్తులు దర్శించుకున్నారు. నల్గొండ నుండి అనేక సంఖ్యలో భక్తులు వచ్చి సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. ముందస్తు జంపన్న వాగులో స్నానాలు చేసి అక్కడి నుండి భక్తి శ్రద్ధలతో తల్లుల వద్దకు చేరుకొని తల్లులకు తమ తమ మొక్కులను భక్తులు అందజేశారు. సమ్మక్క సారలమ్మ దీవెనలు ఉంటే రాబోయే పెద్ద జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మేడారం జాతరను విజయవంతం చేస్తారని, ఆదివారం సెలవు కావడం వలన అలాగే రాష్ట్రంలో స్కూళ్ల ప్రారంభం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకువచ్చి సమ్మక్క సారలమ్మను దర్శించుకున్నారు. వేలాది మంది భక్తుల రాకతో మేడారం సందడిగా మారింది.

## ఆర్యవైశ్య సభకు తరలిన నెక్కొండ వైశ్యులు

ప్రజాపక్షం/నెక్కొండ: వరంగల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ద్వితీయ మహాసభ నర్సంపేట పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు తాటిపల్లి శివకుమార్, ప్రధాన కార్యదర్శి భూపతి వీరన్న లు జిల్లా ఉపాధ్యక్షుడు గోరంట్ల వెంకటనారాయణ, జిల్లా కార్యదర్శి దేశ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు జిల్లా తృతీయ సమావేశం హాజరైనారు. కార్యక్రమంలో భీమ్ శెట్టి శ్రీహరి, తాళ్లూరి నరసింహస్వామి, లక్ష్మయ్య, దుబ్బ నాగరాజు, కొత్తపల్లి రాజు, మోహన్, మల్యాల రామచందర్, నంగునూరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అభినయ్‌ను పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి



ప్రజాపక్షం/సంగెం: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు అప్పే నాగార్జునశర్మ తండ్రి సంగమేశ్వరస్వామి ఆలయ అర్చకుడు అప్పే నాగేశ్వరప్రసాద్ శర్మ శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గ్రామంలో ఉదయం అకాల మృతిచెందిన మేదరి స్వాగత్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సదానందం, సాగర్‌రెడ్డి, కోడూరి సదయ్య, గోవర్ధన్, మనోహర్, బాలకృష్ణ, మల్లయ్య, మున్నూర్ అలీతోపాటు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి హన్మకొండలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగెం మండల బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ గుండేటి బాబు కుమారుడు అభినయ్‌ను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా అభియన్ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలి వైద్యులకు సూచించారు.

## కార్పొరేటర్‌ను పరామర్శ



ప్రజాపక్షం/గీసుకొండ: గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకులపల్లి మనోహర్‌ను ఆదివారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మనోహర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతిచెందిన బీఆర్‌ఎస్ నాయకుడు వనపర్తి సాంబయ్య కుటుంబాన్ని పరామర్శించి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని ధర్మారెడ్డి తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేష్, నాయకులు సుంకరి శివ, గోలి రాజయ్య, యూత్ నాయకులు ఉన్నారు.

### 27న పంచాయతీరాజ్ కమిషనర్

# కార్యాలయం ముందు ధర్నా




ప్రజాపక్షం/హనుమకొండ : తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు పల్లె రామన్న అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య సిఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ లు హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు గత 40 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో పని చేస్తూ గ్రామాలలే నమ్ముకొని కరోనా డెంగ్యూ మలేరియా అలాంటి విపత్కర పరిస్థితిలో సేవలు చేస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న పంచాయతీ సిబ్బంది పట్ల గత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన మండిపడ్డారు. 80 శాతం మంది దళితులు వీరిని బానిసలుగా చూడాలని, గత ప్రభుత్వం జీవో నెంబర్ 51 ని తీసుకొచ్చి మల్టీపర్పస్ వర్కర్ విధానం ద్వారా అనేక ఇబ్బందుల పాలు చేస్తున్నదని ఈ విధానం వల్ల రాష్ట్రంలో 200 మంది కార్మికులు చనిపోయిన ప్రభుత్వలు పట్టించుకోకపోగా ఈ ప్రభుత్వం వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా అనేకసార్లు మంత్రికి, అధికారులకు విన్నవించినప్పటికీ సమస్యలను పట్టించుకోకపోవడం వల్ల ప్రతినెల వేతనాలు వచ్చే పరిస్థితి లేకుండా చాలా ఇబ్బందుల పడుతున్నా పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి గారే స్వయంగా గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెల చెల్లింపులు చేస్తానని ప్రభుత్వ ఉద్యోగుల వాలె వేతనాలు చెల్లిస్తానని చెప్పినప్పటికీ మార్చి పూర్తయిన కూడా అది అమలుకు నోచుకోలేదనిఅన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య , నాయకులు భాస్కర్ , రాజు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భద్రకాళి దేవస్థాన ధర్మకర్తల ప్రమాణస్వీకారం



ప్రజాపక్షం/వరంగల్ టౌన్: చరిత్ర ప్రసిద్ధి గాంచిన వరంగల్ మహానగరంలో పరమపావనమైన పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీభద్రకాళి దేవస్థానానికి ఒక సంవత్సర కాలపరిమితికి తెలంగాణ ప్రభుత్వంచే నియమించబడిన ధర్మకర్తల మండలికి ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ శేషు భారతి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమక్షంలో ధర్మకర్తలచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ ధర్మకర్తల మండలి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ శివసుబ్రహ్మణ్యం అధ్యక్షునిగా, ధర్మకర్తలుగా తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఒరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోతుకూరి మయూరి, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగు ఆంజనేయులు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాసరావు, ఎక్స్ అఫిషియో మెంబర్ పార్నంది నర్సింహులుచే నిబంధనల మేరకు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మకర్తలందరిని అభినందిస్తూ కండువా కప్పి సత్కరించారు. ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. ధర్మకర్తలందరూ దేవస్థాన ఛైర్మన్‌తో కలిసి దేవస్థాన అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈవో, అర్చకులు, సిబ్బంది సమన్వయంతో ఆలయ వ్యవహారాలు ధర్మబద్ధంగా నిర్వహించాలని ఆలయంలోని ఆచార సాంప్రదాయాలకు భంగం కలిగే విధంగా వ్యవహరించకూడదన్నారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ పరిపాలన నిర్వహణలో రాజకీయాలకు తావియ్యకుండా ఆలయ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ప్రధానర్చకులు భద్రకాళి శేషు, 11వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, ఈవీ శ్రీనివాస్, దేవాలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ టాపింగ్ బాధ్యులను కఠినంగా శిక్షించాలి



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలికి అధికారం ఇస్తే గత పాలకులు ప్రజాస్వామ్యాన్ని కూలదోసి ఒక రాచరిక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి తన కున్న అధికారాన్ని అడ్డం పెట్టుకొని అనేక అక్రమాలకు పాల్పడ్డారని జరుగుతున్న దర్యాప్తులు తెలియ జేస్తున్నాయని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. తన సామాజిక వర్గానికి చెందిన అధికారులను ఉపయోగించుకొని అధికార యంత్రాంగాన్ని, దుర్వినియోగపరిచి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం, రాజరిక వంశ పారంపర్య పాలన చిరకాలం కొనసాగించడానికి, ప్రతిపక్ష పార్టీలను బలహీనపరచడం కొరకు వేలాదిమంది ఫోన్లను ట్యాప్ చేయడం జరిగిందని అన్నారు. ఆదివారం తన సొంత గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణతో పాటు ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షులు పుల్లూరు సుధాకర్, ప్రముఖ సామాజిక వేత్త బొమ్మినేని పాపిరెడ్డి, రాచకొండ ప్రవీణ్ అడ్వకేట్ పాల్గొన్నారు. ప్రొఫెసర్ వెంకట్ నారాయణ మాట్లాడుతూ గత సంవత్సరం నుండి జరుగుతున్న ఫోన్ టాపింగ్ సంబంధిత దర్యాప్తుల సమాచారం తెలంగాణ ప్రజాస్వామ్యవాదులను, ఉద్యమకారులను, విద్యార్థి, ఉద్యోగ మేధావి, ప్రజలనే కాకుండా దేశ ప్రజలను కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తున్నదని అన్నారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాల కాలం, ఫోన్ ట్యాపింగ్ ద్వారా దేశంలో మున్నెన్నడు జరగని విధంగా అనేక ప్రజాస్వామిక, అణిచివేత, ఆస్తుల భూముల దోపిడి చర్యలకు పాల్పడ్డట్టుగా వార్తలు వెలువడుతున్నాయని అన్నారు. 1972లో ఆనాటి అమెరికా ప్రెసిడెంట్ రిచర్డ్ నిక్సన్ రెండవసారి ప్రెసిడెంట్ గా ఎంపిక కావడానికి కూడా డెమొక్రటిక్ పార్టీ హెడ్ క్వార్టర్ వాటర్ గేట్ హోటల్లో ఫోన్ టాపింగ్ సామాగ్రిని అమర్చి ప్రత్యర్థుల సమాచారము తెలుసుకొని తప్పుడు మార్గంలో గెలిచాడనీ, ఆ కుంభకోణంలో సహకరించిన అనేక మందికి కఠిన కారాగారవాస శిక్ష విధించడం జరిగింది. నిక్సన్ 1974 లో రాజీనామా చేయడం జరిగిందనీ అన్నారు. ఫోన్ టాపింగ్ అక్రమాలతో ఎన్నికైన ప్రజాస్వామ్య ద్రోహులు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ స్కాండల్ కేవలం పార్టీల మధ్య సమస్య కానే కాదని ఇది ప్రజల ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం, ప్రజల ధనాన్ని, ఆస్తులను, భూములను దోపిడి చేసుకున్న పెద్ద కుట్రగా చూడాలని ఇందులో భాగస్వాములైన పాలకులను, నాయకులను అధికారులను తగిన విధంగా శిక్షించాలని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, ఉద్యమకారులు కోరుకుంటున్నారని అన్నారు.

## అమ్మ ఫౌండేషన్‌కు ఒమినీ వాహనం బహుకరణ

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: జనగామ అమ్మ పౌండేషన్ వ్యవస్థాపకులు మంతెన మణికుమార్ చేపడుతున్న సామాజిక, సేవా కార్యక్రమాలు మరింత వేగంగా జరగాలనే ఆకాంక్షతో జనగామ పట్టణానికెంతదిన వైట్ అండ్ వైట్ బట్టల షాపు యజమానికి గజ్జి మధు ఆదివారం ఓమిని వాహనాన్ని బహుకరించారు. అమ్మ పౌండేషన్ వంతెన మణికుమార్, ముఖ్య సలహాదారులు వంగ భీమ్‌రాజ్‌కు తాళం చెవిలు అందజేసి అమ్మ పౌండేషన్ ద్వారా చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలు మరింత ముందుకు సాగించాలని కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయ స్థాపక అధ్యక్షులు మంతెన మణికుమార్ మాట్లాడుతూ అమ్మ పౌండేషన్ జనగామలో అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పిల్లలకు బట్టలు, పుస్తకాలు అందించడంతో పాటు ఆకలితో అలమటించే వారికి అన్నదానం చేయడం, ప్రముఖుల జన్మదిన వేడుకల సందర్భంగా అల్పాహారం, భోజనం అందించడం జరుగుతుందన్నారు. ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడే వారిని సైతం హాస్పటల్‌కు తీసుకెళ్లడం వంటివి చేస్తున్నామన్నారు. ఈ వాహనాన్ని పూర్తిగా అవసరార్థుల కోసమే ఉపయోగిస్తామని, సేవా కార్యక్రమాలకే వాడతామన్నారు. ఈ కార్యక్రమంలో మర్యాల అశోక్, అమ్మ పౌండేషన్ ప్రతినిధులు నల్ల వినోద్, నల్ల మహేష్, మద్దెల కార్తీక్, బింగి నరసింహులు, లకన్‌సింగ్, చందు, గౌరీ, సాయి, ఎక్కదేవి ఓంకార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా కేంద్రంలో ఒలంపిక్ డే ర్యాలీ

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: అంతర్జాతీయ ఒలింపిక్ దేని పురస్కరించుకొని ప్రొఫెసర్ జయశంకర్ సర్ విగ్రహం నుండి డా।। బిఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించబడునని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సిహెచ్ రఘు, తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని క్రీడా సంఘాల సభ్యులు, క్రీడాకారులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అధిక సంఖ్యలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## గాజర్ల రవి కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

ప్రజాపక్షం/టేకుమట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్ కుటుంబ సభ్యులను వరంగల్ మాజీ ఎంపి,రాష్ట్ర ఫైనాన్స్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ఆదివారం రవి స్వగ్రామమైన మండలంలోని వెలిశాలకు వచ్చి గాజర్ల రవి చిత్ర పటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా రవి తమ్ముడు గాజర్ల అశోక్ (ఐత),అజాద్ కుమారుడు నవీన్‌ను ఎన్‌కౌంటర్ జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.రవి యువకుడిగా ఉద్యమ బాటపట్టి తన సొంత కుటుంబాన్ని ఊరును మరచి ప్రజాసేవే లక్ష్యంగా ఎన్నో కష్టలను అనుభవించి చివరకు తన ప్రాణాలను సైతం కోల్పోయాడని విచారం వ్యక్తం చేశారు.ఆయాన వెంట మండల అధ్యక్షుడు కొటగిరి సతీష్ గౌడ్,జిల్లా నాయకుడు కత్తి సంపత్‌గౌడ్,వీరవేణి శ్రీనివాస్,బండి రవిందర్,వంగ నరేష్,సంగీ రవి,కోరే చందు,జంగపెల్లి సారయ్య,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## లంబాడీలు సామాజిక న్యాయం కోసం పోరాటం చేయాలి

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి: లంబాడీలు సామాజిక న్యాయం కోసం పోరాటం చేయాలని సామాజిక న్యాయ వేదిక ములుగు జిల్లా అధ్యక్షులు పోరిక శ్యామల్ నాయక్ అన్నారు. ములుగు జిల్లా బండారుపల్లిలో లంబాడా న్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడు పాల్తీయ శ్యాం నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సామాజిక న్యాయ వేదిక ములుగు జిల్లా అధ్యక్షుడు పోరిక శ్యామల్ నాయక్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బిసి కులాలలో ఎక్కువ కులాలకు మంత్రి మండలిలో స్థానం లేదని, కుమ్మరి, చాకలి, యాదవ, మున్నూరు కాపు, విశ్వ బ్రహ్మణ, మేరా, మేదర, లంబాడా, వడ్డెర, సామాజిక వర్గాలకు మంత్రి పదవులు నామినేటెడ్ పోస్టులు పార్టీ పదవులు లేవని, కేవలం రెడ్డి, ఎస్‌సి, బ్రహ్మణ వర్గాలకే స్థానం లభించడం విచారకరమన్నారు. ప్రతి కులానికి సామాజిక న్యాయం కోసం గ్రామ గ్రామాన తిరిగి సామాజిక న్యాయం కోసం గ్రామ గ్రామాన తిరిగి సామాజిక న్యాయం కృషి చేస్తానని శ్యామల్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లంబాడా యాదవ, మేర, రజక, తదితర కులాలు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధికి కృషి

## వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరి

### ముగిసిన మానుకోట వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** హైద్రాబాద్‌కు ధీటుగా గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ క్రీడ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు, మానుకోట జిల్లా క్రికెట్‌కు వెన్నుదన్నుగా ఉంటానని ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ అన్నారు. హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో మహబూబాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు బి.అజయ్‌సారథిరెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎంతో మంది క్రీడాకారులు మంచి ప్రతిభ కనపరుస్తున్నారని, ఈ ప్రాంతంలో క్రికెట్ అభివృద్ధికి అన్ని వసతులు ఉన్నాయన్నారు. ఈ ప్రాంత క్రీడాకారులను తీర్చిదిద్దడంలో అజయ్‌సారథిరెడ్డి సేవలు మరువలేనివన్నారు. ఆయన క్రికెట్ అభివృద్ధకి ఎంతో కృషి చేస్తున్నారని హెచ్‌డబ్ల్యుఏతో మాట్లాడి ఇక్కడ మరిన్ని అవకాశాలు అందించడంలో అపెక్స్ కౌన్సిల్‌లో కూడా మాట్లాడి సహకారం అందిస్తానన్నారు. పట్టుదలతో కృషి చేస్తే క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఈ ప్రాంతం నుంచి ఎదిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని, నెల రోజుల క్రికెట్ కోచింగ్ క్యాంప్‌లో అనేక మెలకువలు నేర్చుకున్నారని అన్నారు. మహబూబాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు బి.అజయ్‌సారథిరెరెడ్డి మాట్లాడుతూ డబ్ల్యుడిసిఏ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ ద్వారా జిల్లాకు ఎంతో సహకారం లభిస్తోందన్నారు. ఆయన ఇక్కడ క్రీడాకారులను ప్రోత్సహించడంలో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన అండర్ 14, అండర్ 16, అండర్ 20, అండర్ 23 విభాగాల్లో నిర్వహించిన టోర్నమెంట్‌లో ప్రతిభ కనపర్చిన జట్లకు, క్రీడాకారులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు.



జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అతిధులకు భాణా సంచాకాల్చి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఫైర్‌క్యాంప్‌లో క్రీడాకారులు, అసోసియేషన్ బాధ్యులు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరి కల్లూరి ప్రభాకర్, క్రికెట్ కోచ్ మెతుకు కుమార్, రావుల నవీన్‌రెడ్డి, నీలం వెంకటేశ్వర్లు, మురళి, బి.చరిత్‌రెడ్డి, బి.ధర్మచరణ్‌రెడ్డి, పెరుగు కుమార్, గాదం శ్యాం ప్రసాద్ యాదవ్, వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, కొండమీది రవి, వికాస్, జి.రమేష్, క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోహెడ మండలంలో ఎంపీటీసీ స్థానాలను పెంచాలి



ప్రజాపక్షం/కోహెడః రానున్న స్థానిక సంస్థల ఎన్నికలల్లో కోహెడ మండలంలోని ఎంపీటీసీ స్థానాలను పెంచాలని బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ ఖమ్మం వేంకటేశం, మాజీ ఎంపీటీసీ ఖమ్మం స్వరూప అన్నారు.ఆదివారం పత్రిక సమావేశంలో వారు మాట్లాడుతూ కోహెడ ఎంపీటీసీ పరిధిలో మూడు, గ్రామ పంచాయితీలు కోహెడ, ధర్మసాగర్‌పల్లి, వేంకటేశ్వరపల్లితో పాటుగా వెల్దండిపల్లి, షేరు అలీనగర్, మోతిరాం, జూమ్ల రెండు తండాలు సుమారు 4700 వందలకు పైగా ఓటర్లు కోహెడ మండలంలో 13, ఎంపీటీసీ స్థానాల్లో ఒక్క కోహెడ ఎంపీటీసీ పరిధి ఓటర్లే అత్యధికంగా ఉన్నారన్నారు.మండల పరిషత్ నిధుల విషయంలో చిన్న పెద్ద తేడా లేకుండా సమన్యాయంగా వస్తున్న నేపథ్యంలో పెద్ద పరిధి ఎంపీటీసీ పరిధి గ్రామాలకు అభివృద్ధి చేయలేకపోతున్న పరిస్థితి ఏర్పడిందని కాబట్టి ఎక్కువ గ్రామాలతో కూడిన పెద్ద ఎంపీటీసీ స్థానాల్లో రెండు ఎంపీటీసీలుగా గుర్తించాలని విజ్ఞప్తి చేస్తూ దీనిపై అధికారులు కూడా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు.

# హక్కుల సాధనకై గొర్రెల కాపర్లు ఏకం కావాలి

## జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** గొర్రెలు, మేకల పెంపకం దార్లు తమ హక్కుల సాధనకై ఐక్యంగా పోరాడి సాదించుకోవాలని గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ పిలుపునిచ్చారు. ఆదివారం గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం మహబూబాబాద్ జిల్లా 3వ మహాసభ ఎస్ఎస్‌వివిఎల్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షులు పయ్యావుల మల్లయ్య అధ్యక్షతన జరిగింది. కాసాని ఐలయ్యతో పాటు వివిధ ప్రమాదాల్లో మృతి చెందినవారికి మహాసభలో సంతాప తీర్మానం సంఘ జిల్లా ఉపాధ్యక్షులు ఇమ్మడి గోవింద్ ప్రవేశపెట్టారు. అనంతరం కామారెడ్డిలో జరిగిని బిసి డిక్లరేషన్ అమలు చేయాలని, ప్రమాదవశాత్తు చనిపోయిన గొర్ల కాపర్లకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, గొర్లు, మేకలుకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కల్పించాలని, తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిలా నాయకులు కేశబోయిన మల్లయ్య, చిన్నాల కట్టమల్లు, నూకల లక్ష్మి నారాయణ, సోమనబోయిన లింగయ్య, గంద్రకోటి కుమార్, సురేందర్, చిన్నబోయిన అశోక్, బిక్షపతి, రమేష్, దేవేందర్, రాములు, సత్యనారాయణ, మహేష్, వెంకటేష్, మల్లయ్య, రఘు, ఎడ్ల శ్రీనివాస్, నేతుల రాకేష, నరసయ్య, మంచాల హరీష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



**ప్రజాపక్షం, తొర్రూరు :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజల వద్దకు తీసుకెళ్లి వారికి నిజాలు తెలియజేసే విధంగా ప్రతీ ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆరు మండలాల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూత్ సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.తొర్రూరు మండల సీనియర్ నాయకులు, కంఠాయపాలెం గ్రామ మాజీ ఎంపీటీసీ గుండా సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు.

# చేపల సంఘం నుంచి ముదిరాజ్ సంఘానికి వచ్చే నిధుల దుర్వినియోగం

## పోలీస్‌స్టేషన్ ముందు నిరసన




**ప్రజాపక్షం/రామాయంపేట,:** చేపల సంఘం నుండి నిదులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపిస్తూ రామాయంపేట ముదిరాజ్ సంఘం సభ్యులు ఆరోపించారు. ఆదివారం పెద్దమ్మ దేవాలయం వద్ద సమావేశమైన సభ్యులు గత కొన్ని సంవత్సరాలుగా ముదిరాజ్ సంఘం పెద్దమ్మ అమ్మవారి ఆలయానికి నిదులు రాకుండా దుర్వినియోగం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీస్‌స్టేషన్ ముందు నిరసనకు దిగారు. ఈసందర్భంగా సంఘం బాద్యులు దేవుని రవి, చిలుక గంగాదర్, రెడ్డమైన నరేష్‌లు మాట్లాడుతూ చేపల సంఘం నుండి ముదిరాజ్ సంఘానికి రావాల్సిన నిదులు కొంతమంది పెద్ద మొత్తంలో కాజేశారని అన్నారు. సుమారు మూడు సంవత్సరాల నుండి సంఘానికి రావాల్సిన నిదులను దేవుని నర్సింలు, దేవుని సర్వయ్య, అక్కల వెంకటి (పండ్లపండి) కాజేశారని అందుకు సంబందించిన పూర్తి ఆదారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. సంఘంలో నుండి డబ్బులు కాజేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అంతే కాకుండా ఒకే సంఘంలో ఉన్నప్పటికి మూడు చెరువులలోని చెపల ఆదాయంలో పెద్దమ్మ దేవాలయం ముదిరాజ్ సంఘానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు 8వందల మంది సభ్యులు ఉన్న ముదిరాజ్ సంఘంలో కేవలం 6070 మంది మాత్రమే చాపల సంఘంలో పూర్తి హక్కులు తీసుకోవడం సరికాదన్నారు. నిదుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై మత్స్యశాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని విన్నవించారు. లేనియెడల ముదిరాజ్ సంఘం అద్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

# కుక్కల దాడిలో దూడ మృతి



**ప్రజాపక్షం/రేగోడ్:** మండల పరిధిలోని మర్పల్లి గ్రామంలో కుక్కల దాడిలో లేగదుడ మృతి చెందినది మర్పల్లి గ్రామానికి చెందిన రైతు భూమ్ రెడ్డి ఆవు రెండు రోజుల కిందనే లేగదుడకు జన్మనిచ్చింది దూడను ఆదివారం తెల్లవారుజామున కుక్కలు దాడి చేసి గాయిపరిచాయి తీవ్రగాయాలైన లేగదుడ మృతు చెందినట్లు రైతు భూమిర రెడ్డి తెలిపారు గతంలో కూడా మేకల పై కుక్కలు దాడి చేసి చంపేశాయని గ్రామస్తులు తెలిపారు.

# లయన్స్ సేవా తరుణి అధ్యక్షురాలుగా శ్రీదేవిరెడ్డి బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం, తొర్రూరు :** సమాజంలో అవసరార్థులకు లయన్స్ క్లబ్‌లు అండగా నిలిచి సామాజిక కార్యక్రమాల నిర్వహణతో అందరి ఆదరణ పొందుతుందని లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. 2025–2026 సంవత్సరానికి సేవా తరుణి నూతన అధ్యక్షురాలిగా తుమ్మూరు శ్రీదేవిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కూన పద్మావతి, కోశాధికారి వేముల మంజులతో పాటు కార్యవర్గ ప్రతినిధులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న తరుణంలో తొర్రూరులో సేవా తరుణి క్లబ్ పేరున అతివలంతా కలిసి ఉత్తమ సేవలు అందిస్తూ ఎన్నో రకాల సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిరుపేదలకు సేవ చేయాలన్న ప్రధాన సంకల్పంతో సేవా తరుణి ప్రతీ ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమాలు జిల్లాలోనే అనేక క్లబ్‌లకు ఆదర్శంగా నిలిచిందన్నారు.నూతన అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డి మాట్లాడుతూ సేవా తరుణి పూర్వ కార్యవర్గాలు నిర్వహించిన కార్యక్రమాల పరంపరను కొనసాగిస్తూ మరింత సేవలను విస్తృతపరుస్తామని చెప్పారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి కనీస విద్యా అవసరాలను తీర్చే దిశగా కార్యాచరణ రూపొందించుకొని జిల్లా లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు, పూర్వ గవర్నర్లు, క్లబ్ పూర్వ బాధ్యులు, సభ్యుల సహకారంతో కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ్లబ్ తక్షణ పూర్వ అధ్యక్షురాలు మాదవపెద్ది వాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్.సుధాకర్‌రెడ్డి, పి.హరికిషన్‌రెడ్డి, పూర్వ గవర్నర్లు డాక్టర్ కె.రాజేందర్‌రెడ్డి, టి.లక్ష్మి నర్సింహారావు, కన్నా పరశురాములు, జిల్లా బాధ్యులు సీహెచ్.రఘునాథరెడ్డి, డాక్టర్ వి.శారద, ఆర్.వెంకన్న, డాక్టర్ పి.కిరణ్‌కుమార్, రేవూరి రమణారెడ్డి, డాక్టర్ సురేశ్, చంద్రగిరి ప్రసాద్, అజిత్, రాజమౌళి, రీజియన్ చైర్మన్ డి.సరేశ్, రాజేశ్వరి, ఉషా, రేవతి, జోన్ చైర్మన్లు ఆర్.శ్రీదేవి, వి.దీప, క్లబ్ ప్రతినిధులు డాక్టర్ ఎస్.నాగవాణి, పి.రజిత, వి.శైలజ, ఎ.రాధిక, ఎం.మణి, రేణుక దేవి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

### కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు తిరుపతిరాథోడ్..

**ప్రజాపక్షం/శివ్వంపేట :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండలాధ్యక్షులు తిరుపతిరాథోడ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18నెలల్లోనే ఉచిత బస్సు, 500 రూపాయలకే గ్యాస్, నియోజకవర్గానికి 3500 ఇళ్లు, రైతు భరోసా ఎకరాకు రూ. 6వేలు, ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక్కొక్కటిగా ఇచ్చిన హామీలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో వందశాతం కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## గొర్రె వెంకట్‌రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** నర్సాపూర్ ఆత్మకమిటి మాజీ ఛైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డిని ఆదివారం మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతన్న గొర్రె వెంకట్‌రెడ్డిని పరామర్శించి అతని ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## నేడు విగ్రహ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ మండల పరిధిలోని జక్కపల్లి మాజీ సర్పంచ్ వంజరి శ్రీనివాస్ విగ్రహాన్ని నేడు ఆవిష్కరణ.కు ముఖ్య అతిథులు మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి లు పాల్గొని విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నట్లు మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఈటూరి శివకుమార్ తెలిపారు.

# వనదుర్గమ్మకు జన హారతి

**ప్రజాపక్షం/పాపన్నపేట :** జనమేజయుని సర్పయాగస్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. దేశంలోనే రెండో వనదుర్గామాత ఆలయం, ఆధ్యాత్మిక వాతావరణం, ఆలయం చుట్టూ పచ్చని చెట్లు, గలగల పారే గంగమ్మ పరవళ్ళు.. ప్రకృతి ఒడిలో సేద తీరుతున్నామనిపించే వాతావరణం, ఇది ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రం సొంతం, ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఏడుపాయలకు భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాలు భక్తులతో జనసంద్రమైం ది. ఆలయ అర్చకులు వేకువజామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించి భక్తులకు వనదుర్గమ్మ దర్శనం కల్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు



పొరుగు జిల్లాలు, జంట నగరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మ దర్శనానికి తరలివచ్చారు. చెక్ డ్యామ్, అమ్మవారి ప్రధాన ఆలయం ముందున్న మంజీరా నదీ పాయలో పుణ్యస్నానాలు ఆచరించి వనదుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు.

## సాయిక్రిష్ణ హాస్పిటల్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/కొహెడః** కొహెడ మండలంలోని సాయిక్రిష్ణ హాస్పిటల్‌లో ఏడవ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్ యాజమాన్యం కనగండ్ల శ్రీనివాస్, డాక్టర్ శ్రీమాన్ రావు ఎండి పిజిషియన్, డాక్టర్ దేవి స్త్రీల వైద్య నిపుణులు, డాక్టర్ జయంత్ ఎంబిబిఎస్, డాక్టర్



లావణ్య చర్మవ్యాధి నిపుణులతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ కరీంనగర్, సిద్దిపేట వంటి పట్టణాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా అన్ని రకాల వైద్యసేవలు మన సాయిక్రిష్ణ హాస్పిటల్‌లో ఉన్నాయని, అందరూ వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది రాకేష్, అక్షయ్, అర్పిత, రమేష్, అఖిల, ఖమ్మం వేంకటేశం, మ్యాకాల రజినీకాంత్‌రెడ్డి, ఈశ్వరయ్య, గాజుల వేంకటేశ్వర్లు, పొన్నాల రవి, సమ్మయ్య టీచర్, రాజు పాల్గొన్నారు.

## మర్పడగలో బిజెపి రచ్చబండ కార్యక్రమం

**ప్రజాపక్షం/కొండపాక:** మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ఆదేశానుసారం నేడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని కొండపాక మండల బిజెపి అధ్యక్షులు నీల సత్యం ముదిరాజ్ అన్నారు.ఆదివారం మండలంలోని మర్పడగా గ్రామంలో మండల ప్రధాన కార్యదర్శి, బాషమైన ప్రశాంత్, సీనియర్ నాయ



కులు కోడూరు మల్లేశం, అవిశిపురం స్వామి, యాదవ రెడ్డి, దున్న చంద్రం బూత్ అధ్యక్షులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, సీసీ రోడ్లతో పాటు ప్రకృతి వనాలు, స్మశాన వాటికల నిర్మాణం, ఉపాధి హామీ రోడ్ల పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. రేషన్ బియ్యం ఒక్కొక్కరికి 5 కిలోలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కేంద్రం వాటా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రబారి, మాజీ సర్పంచ్ బడకోల్ నర్సింలు, గిరి నారాయణరెడ్డి, ఉప్పరి ఆంజనేయులు, కాటమైన సాగర్, యామ అనిల్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ లో మహనీయుల విగ్రహాలకు అవమానం

### బిఎస్‌పి సెంట్రల్ కోఆర్డినేటర్ వీసాని రాంచందర్



**ప్రజాపక్షం/నర్సాపూర్:** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఎత్తివేసేందుకు కుట్ర పండుతుందని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ వీసాని రామచందర్ అన్నారు. ఆదివారం నర్సాపూర్‌లో నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల బీఎస్పీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసాని రామ్ చందర్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తమకు అనుకూలంగా రాజ్యాంగాన్ని మార్చుకునేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. రాజ్యాంగాన్ని ఎత్తివేస్తే దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు నష్టం జరుగుతుందని ఆయన మండిపడ్డారు. రాజ్యాంగాన్ని ఎత్తివేయాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. బీసీ కులగణన తప్పులు తడాఖా అని విమర్శించారు రాజ్యాంగం పుణ్యమా అని వంటింటికే పరిమితమైన మహిళలకు నేడు చట్టసభల్లో స్థానం కల్పించిన ఘనత అంబేద్కర్ రచించిన రాజ్యాంగ పుణ్యమేనని అన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి, మూడుసార్లు ఎమ్మెల్యేగా రెండుసార్లు మంత్రిగా చేశారంటే అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పుణ్యమే అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మహనీయుల విగ్రహాలకు అవమానం జరుగుతుందని తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి కలగజేసుకొని మహనీయుల విగ్రహాలకు అనువైన స్థలం చూసి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర కోఆర్డినేటర్ కూతాడి నరసింహులు మాట్లాడుతూ, బీఎస్పీ పార్టీని జిల్లాలో గ్రామ గ్రామాన బలోపేతం చేసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీఎస్పీ పార్టీ తరపున అభ్యర్థి నిలిపి సత్తా చాటుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్షులు స్వామి దాస్, నర్సాపూర్ అసెంబ్లీ అధ్యక్షులు జనార్ధన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రవి గౌడ్, నాయకులు రవి తదితరులు ఉన్నారు.

## రేపు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ రాష్ట్ర డిబిఎఫ్ పర్యటన

**ప్రజాపక్షం/నిజాంపేట్:** నెల 24న మెదక్ జిల్లాలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పర్యటిస్తున్నారని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, డిబిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజివ్, డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మకొండ దయాసాగర్ లు తెలిపారు. 24 మధ్యాహ్నం 2 గంటలకు మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అట్రాసిటీ, ఎస్సీ, ఎస్టీల సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించ నున్నందున బాధితులు తమ సమస్యల పై ఫిర్యాదులు చేయాలన్నారు. జిల్లాలోని అట్రాసిటీ కేసు లు, ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారంకు కమిషన్ ను సంప్రదిం చి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విన్నవించారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్ లో గురు శిష్యుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ప్రాథమిక పాఠశాల చల్మెడ 1990–1997 బ్యాచ్ చెందిన విద్యార్థిని విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కలుసుకొని గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి మెమెంటోళ్లను అందజేశారు. విద్యార్థులకు విద్యార్థి దశ ప్రైమరీ దశతోనే పునాది వేయబడుతుందని కావున ప్రతి ఒక్క విద్యార్థి ప్రైమరీ దశలో రాణించినట్లయితే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని గురువులు సూచించారు. అప్పర్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులు గురువులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం రాష్ట్రస్థాయిలో ఇదే ప్రథమ సమ్మేళనంగా చెప్పవచ్చు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, భగవాన్, వెంకటస్వామి, గోపాల్, ఉపాధ్యాయురాలు మహేశ్వరి మేడం, విద్యార్థులు నరసింహా చారి, మురళి, శ్రీను, సుమన్, మల్లారెడ్డి, స్వామి, చంద్రం, పద్మ, యాదమ్మ,సంతోషి, బాబు పాల్గొన్నారు.

## కొహెడలో ఉచిత మెగా వైద్య శిబిరం




**ప్రజాపక్షం/కొహెడ:** గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్టు, కెల్విన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కొహెడ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గవ్వ వంశీధర్‌రెడ్డి డాక్టర్లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా గవ్వ వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకి మెరుగైన వైద్య సేవలు అందించడము కోసమే ఈ వైద్య శిబిరం నిర్వహించారని ఈ వైద్య శిబిరంలో గుండె సంబంధిత వ్యాధి నిపుణులు ఎముకలు కీళ్ల వైద్య నిపుణులు జనరల్ సర్జన్ దంత వైద్య నిపుణులు మొదలైన వారు పాల్గొని అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారన్నారు.గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గత పదకొండు సంవత్సరాలుగా అనేక రంగాల్లో ప్రత్యేకంగా విద్య వైద్య రంగాలలో సేవలు అందిస్తున్నామని భవిష్యత్తులో మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు హుస్నాబాద్ నియోజక వర్గం వ్యాప్తంగా అందిస్తామని గవ్వ వంశీధర్‌రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు గవ్వ కిషన్ రెడ్డి, పలువురు డాక్టర్లు వైద్య సిబ్బంది, నాయకులు ముంజ శ్రీనివాస్, వేముల వీరస్వామి, అన్నాడి లక్ష్మారెడ్డి, కోనవేని బాలకిషన్, తిప్పర వేణి భాస్కర్, పోలవేణి కుమారస్వామి, ఎండి ఓవైస్, వేల్పుల శంకర్, సైఫోదిన్, చల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఐలయ్య, పిడిశెట్టి రాజు, గడిపే సుజిత్, చిగురు సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ వ్యవస్థ ఉన్నంత వరకు కమ్యూనిస్టులు ఉంటారు

**సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్**



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :దోపిడీ వ్యవస్థ ఉన్నంత వరకు కమ్యూనిస్టులు ఉంటారని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. ఆదివారం సీపీఐ నగర మహాసభ డివిజన్ 1లో రైస్‌మిల్ ఫిట్టర్స్ ఏఐటియుసి కార్యాలయంలో ఓమయ్య అధ్యక్షతన నిర్వహించగా సుధాకర మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అడవులను స్వాధీనం చేసుకుని ఖనిజ సంపదను కార్పోరేట్ శక్తులకు దోచి పెట్టడం కోసమే ఆపరేషన్ కగార్ నిర్వహిస్తూ బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని తెలిపిన తర్వాత కూడా వారిపై దాడి చేసి చంపడం క్షమించరానిదన్నారు. అర్బన్ నక్సలైట్ పేరుతో కమ్యూనిజంను తుడిచిపెట్టాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. పాలక ప్రభుత్వాలు పేదలకు కార్మిక వర్గానికి తోపిడీ చేస్తున్నంత కాలం ఎర్రజెండా కమ్యూనిస్టు పార్టీలు ఉంటాయన్నారు. సీపీఐ ఏర్పాటు ఐ 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పార్టీ, ప్రజాసంఘాలు మరింత విస్తృతంగా ప్రజా, కార్మిక సమస్యలపై పోరాటాలు నిర్వహించాలన్నారు. నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి గత 20 సంవత్సరాలుగా వందలాది కోట్లు ప్రభుత్వం వెచ్చించినప్పటికీ ఇంకా నగర ప్రజలకు ఉపయోగంలోకి రాకపోవటం పాలకుల నిర్లక్ష్యమేనన్నారు. నగర సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ మహాసభ నుద్దేశించి సిపిఐ జిల్లా నాయకులు రాజన్న మాట్లాడారు. నగర నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నామన్నారు. నగర కార్యదర్శి ఓమయ్య, సభ్యులుగా ఫిరోజ్‌అలీ, అనిల్, రంజిత్, దేవేందర్, భానుచందర్, నర్సింగరావు, హన్మాండ్లు, రఘురాం, సురేష్, ముత్యాలు, లింబాద్రి, భాగ్యలక్ష్మీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.

## మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి



ప్రజాపక్షం/రామగుండం : మోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకుడు మెరుగు చంద్రయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ అంతర్గాం మండల కార్యదర్శి కొల్లూరి మల్లేష్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట పార్టీ కార్యాలయంలో మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న వరంగల్‌లో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆపరేషన్ కగార్ పేరిట కొనసాగుతున్న నరమేధాన్ని ఆపాలని ఆదివాసుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఐ.రాజేశం, వేల్పుల సాంబయ్య, టి.రాజకొమురయ్య, ఎల్.శంకర్, ఈదునూరి బాబు, ఎం.గంగమల్లయ్యలు పాల్గొన్నారు.

## మందగించిన రుతుపవనాలు.. జాడలేని వర్షాలు

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :రోహిణికార్తె ముందు ముగిసిపించిన వర్షాలు ఆరుద్రకార్తె వచ్చినా వర్షాలు కురవకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.వర్షం కోసం వేయికన్నులతో ఎదురుచూడవలసి పరిస్థితి నెలకొంది.రాష్ట్రంలో రుతుపవనాలు మందగించడంతో వర్షాలు జాడలేకుండా పోయాయి.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటుగా కొన్ని గ్రామాలలో వర్షం చినుకుల కోసం అన్నదాతలు కష్టతల్లి ఆడారు.ఇప్పటికే అడప దడపాతో కురిసిన జల్లులకు దుక్కులు దున్నారు. భారి వర్షం కురిస్తే విత్తనాలు విత్తుకోవచ్చునని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు.నైరుతి రుతుపవనాలు కూడ తొందరగా వచ్చినట్లే వచ్చి మోహం చాటేశాయి.అక్కడక్కడ తేలికపాటి వర్షాలు మాత్రమే కురిశాయని అంటున్నారు.కేవలం ఈ నెలలో ఈదురుగాలులు తప్ప వర్షాలు కురవకపోవచ్చునని మేధావులు.వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నాయి.వర్షాలు సమృద్ధిగా కురవాలని కాలం కాకపోతే ఇబ్బందులు పడవలసి వస్తుందని రైతన్నలు ఆవేదన చెందున్నారు.

## రాజీవ్ రహదారిపై పాదాచారులకు రక్షణ కరువు





ప్రజాపక్షం/పాలకుర్తి : హైదరాబాద్‌కరీంనగర్‌రామగుండం(హెచ్‌కెఆర్) రాజీవ్ రహదారి అయిన రాష్ట్ర హైవేపై రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని, ఇక్కడ రోడ్డు దాటాలంటే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ అన్నారు. ప్రధానంగా బిపవర్‌హౌజ్ మలుపు, ఎన్టీపీసీ పట్టణ కూడలి, ఎఫ్‌సిఐ క్రాస్‌రోడ్, గోదావరిఖని అంబేద్కర్ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్ వద్ద పాదాచారులు, విద్యార్థులు, కార్మికులు రోడ్డు దాటుతూ ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. నిత్యం రాజీవ్ రహదారిపై వేలాది వాహనాలు ప్రయాణిస్తుండటంతో ఈ ప్రాంతాలు అత్యంత రద్దీగా ఉంటున్నాయన్నారు. స్థానిక పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఎన్‌టిపిసి విద్యుత్తు కేంద్రాలు, ఆర్‌ఎఫ్‌సిఎల్ కర్మాగారంలో పనిచేసేందుకు వెళ్లే కాంట్రాక్టు కార్మికులు, కూలీలు ఎన్‌టిపిసి కూడలి, ఎఫ్‌సిఐ క్రాస్ రోడ్ వద్ద రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా ఈ రెండు చోట్ల హైవేకు ఆనుకొని రెండు మద్యం దుకాణాలు ఉండటంతో రద్దీ మరింత పెరిగిందన్నారు. అదేవిధంగా ప్రతి ఆదివారం ఎన్టీపిసిలో రాజీవ్ రహదారి పక్కనే వారసంత నిర్వహిస్తుండటంతో రోడ్డు దాటేందుకు ప్రజలు భయపడుతున్నారన్నారు. అదేవిధంగా గోదావరిఖని ఆర్టీసీ బస్టాండు వద్ద బస్సు ప్రయాణికులు ప్రాంగణంలోకి వెళ్లాలన్న, బయటికి రావాలన్న హైవేను దాటాలని ఈ సందర్భంగా వేగంగా వస్తున్న భారీ వాహనాలను తప్పించుకొని వెళ్తూ ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. హెచ్‌కెఆర్ సంస్థకు టోల్ వసూళ్లపై ఉన్న శ్రద్ధ రోడ్డు భద్రత, ప్రయాణికుల ప్రాణాలపై లేదన్నారు. ఇటీవల రామగుండంలోని రాజీవ్ రహదారి పక్కన సర్వీసు రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తున్న రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ పుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం కూడ చేపట్టాలని, రోడ్డు దాటే ప్రజలు ప్రమాదాల బారినపడకుండా చూడాలని జూపాక శ్రీనివాస్ కోరారు.

## వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పాలన



ప్రజాపక్షం/అంతర్గాం : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం బ్రహ్మణపల్లిలో బిజెపి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యంగా నరేంద్రమోదీ పాలన కొనసాగుతున్నదన్నారు. 11 ఏళ్ల మోదీ పాలనలో భారత దేశాన్ని విశ్వవేదికపై ఉన్నత స్థానంలో నిలబెట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, చారిత్రక నిర్ణయాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను ప్రజలు విశ్వసించడంలేదన్నారు.. ఈ కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి రాముగౌడ్, సిన్నల రాజేందర్, అలవాల లింగయ్య, లగిశెట్టి కొండన్న, దర్శనాల చంద్రశేఖర్, చిన్నాల లింగయ్య, కాడె శ్రీనివాస్, కుదురుకోట రాజనర్సు, సిన్నల ఓదేలు, మునుకుంట్ల పరమేష్, జాబు అంజి తదితరులు పాల్గొన్నారు.

# జిఓలను ఉల్లంఘిస్తే కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధం

**నగర మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్**



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:ప్రజల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు, పరిపాలన దృష్ట్యా పారదర్శకంగా డివిజన్ల పునర్విభజన జరగాలే తప్ప రాజకీయాలు, నాయకుల కోసం కాదని నగర మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. అందుకు రూపొందించిన జీవోలను ఉల్లంఘించకుండా కలెక్టర్ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఆదివారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులు ఎన్నికలు నిర్వహిస్తామని గత కొన్ని నెలలుగా ఊరిస్తున్నారన్నారు. గతంలో ఉన్న కరీంనగర్ నగర మున్సిపల్ కమిషన్ జీవో 269 ను ప్రభుత్వం విడుదల చేయకముందే అధికారులకు ప్రతి నూతన డివిజన్ ఏర్పాటుకు 5500 ఓట్లు మించకుండా రూపకల్పన చేయాలని బహిర్గతం చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో 12 ఆధారంగా జీవో 269ను విడుదల చేశారని, పారదర్శకంగా డివిజన్ల రూపకల్పనకు 2021లో కెసిఆర్ ప్రభుత్వం జీవో 12 తీసుకొచ్చిందని పేర్కొన్నారు. జీవో 12 ప్రకారం ఎట్టి పరిస్థితుల్లోనూ నగర డివిజన్ల ఏర్పాటుకు కేవలం 10 శాతం పెంచడం లేదా తగ్గించడం చేయాలని స్పష్టంగా ఉందన్నారు. కాగా జూన్ 16న జిల్లాలోని మజ్లిస్ కార్పోరేటర్లు, కార్యవర్గ సభ్యులందరూ ఓవైసీ దగ్గరకు వెళ్లారని తెలిపారు. ఓవైసీ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంట్లో కలిసి డివిజన్ల ఏర్పాటుకు గంటల పాటు చర్చించారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయకముందే ఇలాంటి చర్చలు జరిపి జీవో 12ను ఉల్లంఘించే అవకాశం ఉందని పేర్కొన్నారు. జీవో 12ను ఉల్లంఘించి 5 వేల ఓట్ల జనాభాను కేవలం 2 వేలకు మార్చేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్, మున్సిపల్ కమిషన్ జీవో ప్రకారంగా ముందుకు పోవాలని కోరారు. కేవలం రాజకీయ నాయకులు మాత్రమే రూపకల్పనకు ధరఖాస్తులు ఇచ్చారని, నగర ప్రజలు ఎవరూ డివిజన్లను ఏర్పాటు చేయాలని కోరలేదన్నారు. ప్రజలు కోరుకునేది పరిపాలన, మౌలిక సదుపాయాలు మాత్రమేనన్నారు. రాజకీయాల వల్లే ప్రజలు నష్టపోతున్నారన్నారు. జీవోను ఉల్లంఘిస్తే కోర్టును ఆశ్రయిస్తానని హెచ్చరించారు. తతంగం మొత్తం బిజెపి, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలే చేస్తున్నాయని విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించాలని, రాజకీయాలు కేవలం ఎన్నికల వరకు మాత్రమేనన్న ఆయన డివిజన్లను అనుకూలంగా మార్చుకుని మోసం చేస్తారా? ప్రజల కోసం ఆలోచించే ప్రయత్నం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. ఓవైసీతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు జరపలేదని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. ఆధారాలు న్యాయని, నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. నగర అభివృద్ధిపై ఒక్క రోజు మాట్లాడని మంత్రి ఎన్నికలు రాగానే ఇష్టానుసారంగా వ్యవహరించి ఓట్ల దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, అధికారులు పారదర్శకంగా డివిజన్లు ఏర్పాటు చేయాలని, రాజకీయాలకతీతంగా రూపకల్పన చేయాలని కోరారు. నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేష్, కెంసారం తిరుపతి తదితరులున్నారు.

## రాజేశ్వర్‌కు కీలకమైన పదవి రావడం హర్షణీయం..

**నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు..**

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:బడుగు బలహీన,బహుజన వర్గాల నాయకుడు ఎంబడి రాజేశ్వర్ కి కీలకమైన పదవి రావడం చాలా గొప్ప విషయం అని నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు అన్నారు.ఆదివారం ఇటీవల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమకమైన ఎంబడి.రాజేశ్వర్ ని ఆయన నివాసంలో నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు మాట్లాడుతూ ఎంబడి రాజేశ్వర్ గత 36 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేశారని అందుకు తగిన గుర్తింపును తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పదవిని కాంగ్రెస్ పార్టీట ఇవ్వడం చాలా సంతోషమని రాబోయే రోజుల్లో రాజేశ్వర్ ఉన్నత పదవులు రావాలని కోరారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా కోకన్వీనర్లు అశోక్ చారి,సిరి కొండ రమేష్ పందరినాథ్ ఆకుల రామకృష్ణ కార్యనిర్వాహక అధ్యక్షుడు చంద్రశేఖర్,దేవర కోట దేవస్థానం కమిటీ డైరెక్టర్ సంతోష్,సంపత్ తదితరులు పాల్గొన్నారు.